TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక :15 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ శనివారం.09.08.2025 పేజీలు : 4, వెల:రూ.1.00

## పేదల ముఖంలో నవ్వు చూడటమే కాంగ్రెస్ లక్ష్యం: పొంగులేటి

హైదరాబాద్:అమృత్ తెలంగాణ: ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులను పారదర్శకంగా ఎంపిక చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఏ పార్టీ కార్యకర్త అని కూడా చూడకుండా లబ్దిదారులను ఎంపిక చేశామని అన్నారు. ఏడేళ్ల క్రితం నిర్మించిన 592 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పొంగులేటి ప్రారంభించారు. హనుమకొండ బాలసముద్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా పేదవాడైతే చాలు ఇళ్లు ఇవ్వాలని అధికారులకు చెప్పామని, పేదల ముఖంలో నవ్వు చూడటమే లక్ష్యం అని తెలియజేశారు. గత ప్రభుత్వం రెండుపడకల గదులను పార్టీ కార్యకర్తలు, కొందరు ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే ఇచ్చిందని అన్నారు. మొదటి విడతలో 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, గత ప్రభుత్వం పదేళ్లపాటు ఎవరికీ రేషన్ కార్డులు ఇవ్వలేదని విమర్శించారు.

ఈ ప్రభుత్వం 6.50 లక్షల మందికి కొత్త రేషన్ కార్డులు ఇచ్చిందని కొనియాడారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులో భార్య పేరు, పిల్లల పేర్లు చేర్చే అవకాశం కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. రైతుభరోసా కింద రైతుల ఖాతాల్లో 9 రోజుల్లోనే రూ. 9 వేల కోట్లను జమచేశామని పొంగులేటి చెప్పారు. బిఆర్ఎస్ ప్రభుత్వం వేల కోట్ల కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిందని, రూ. లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలను విచారణ కమిషన్ బయటపెట్టిందని అన్నారు. బిసిలకు



రిజర్వేషన్లను పెంచుతూ కాంగ్రెస్ ప్రభుత్వ చట్టం చేసిందని ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన బిల్లులను కేంద్రంలోని బిజెపి ఆమోదించలేదని పేర్కొన్నారు. బిసి రిజర్వేషన్లకు అడ్డుపడుతున్న బిజెపికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు.

## బండివి అడ్డగోలు మాటలు

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ఫోన్ ట్యాపింగ్ అంశంపై నిరాధార ఆరోపణలు చేస్తూ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్ని హద్దులు దాటారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారక రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మినిమం కామన్ సెన్స్ లేకుండా, వాస్తవాలను తెలుసుకోకుండా, అసంబద్ధమైన, దిగజారుడు, థర్డ్‌క్లాస్ ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. చవకబారు పబ్లిసిటీ కోసం, మీడియా దృష్టిని ఆకర్షించేందుకు ఇలాంటి అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. శుక్రవారంఈమేరకు కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. బండి సంజయ్ చేసిన ఆరోపణల్లో ఒక్క శాతం నిజమున్నా నిరూపించాలని సవాల్ విసిరారు. తక్షణమే ఆ ఆరోపణలను ఉపసంహరించుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్



చేశారు.ఆయనకు లీగల్ నోటీస్ పంపిస్తున్నట్టు తెలిపారు. ఈ డిమాండ్‌ను పట్టించుకోకపోతే 48 గంటల గడువు తర్వాత బండి సంజయ్‌ని కోర్టుకీస్తానని హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్ అనే అంశం ఎంత సున్నితమైనదో, చట్టపరంగా ఎంత కఠినమైనదో తెలవకుండానే వాస్తవాలను వక్రీకరిస్తున్నారని విమర్శించారు.సాక్ష్యం కూడా లేకుండా తమపై ఆరోపణలు చేయడం ఆయన రాజకీయ దిగజారుతున్నారని విమర్శించారు. కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్‌కి నిఘా వ్యవస్థల పని తీరు, విధానాలపై కనీస అవగాహన, పరిజ్ఞానం, ఇంగిత జ్ఞానం కూడా లేదని చురకలాంటించారు. కేంద్ర మంత్రిగా పని చేయడమంటే, ఢిల్లీ బాసులకు చెప్పులు మోసినంత ఈజీ కాదని చెప్పారు.

## సైబర్ సెక్యూరిటీ రాజధానిగా హైదరాబాద్

హైదరాబాద్:అమృత్ తెలంగాణ: దేశంలో సైబర్ సెక్యూరిటీకి రాజధానిగా హైదరాబాద్ ఎదుగుతోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. హైదరాబాద్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో శుక్రవారం జోహో కార్పొరేషన్‌కు చెందిన మ్యానేజ్ ఇంజిన్ నిర్వహించిన షీల్ ఎన్ఎక్స్ జీ 2025 – సీఐఓ కనెక్ట్ సిరీస్ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ దేశంలోనే మొట్టమొదటి సైబర్ సెక్యూరిటీ బ్యూరోను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది. నెలకు 1,200 కుపైగా కేసులు పరిష్కరిస్తోంది. అత్యధిక శిక్ష విధింపు రేటు నమోదు చేసిన ఈ బ్యూరోను జిల్లాల స్థాయికి విస్తరిస్తున్నామని, స్టార్టప్‌లకు, గ్రామీణ ప్రాంత యువతకు సైబర్ మద్దతు అందించేందుకు చర్యలు చేపట్టాయని అన్నారు. జోహో సంస్థ తీసుకుంటున్న గ్రామీణ అభివృద్ధి మార్గాన్ని ఈ సందర్భంగా మంత్రి ప్రశంసించారు. పట్టణ–గ్రామీణ మధ్య సాంకేతిక అంతరాన్ని తగ్గించాలన్న దిశగా ఇది చక్కటి ఉదాహరణ అన్నారు. డిజిటల్ పరిణామాల దృష్ట్యా డిజిటల్ ఇండియా యాక్ట్, డిపిడిపి యాక్ట్ అమలు కీలకమని పేర్కొన్నారు. ఎథికల్ హ్యాకింగ్ ఫెలోషిప్, సైబర్ హైజీన్ విద్య, ఏఐ ఆధారిత శిక్షణలు వంటి కార్యక్రమాలను ప్రభుత్వం ప్రారంభిస్తుందని మంత్రి తెలిపారు. నమ్మకం, బాధ్యత, భాగస్వామ్యం –ఇవే భవిష్యత్ సైబర్ సెక్యూరిటీకి పునాది కావాలని మంత్రి పేర్కొన్నారు. సైబర్ ముప్పులు, భద్రతలపై దేశవ్యాప్తంగా ఉన్న సీఐఎస్ఓలు, నిపుణులు, విధాన నిర్ణేతలు ఈ వేదికలో చర్చించారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు




న్యాయవాది, సైబర్ నిపుణుడు డా. పావన్ దుగ్గల్, ఎన్ఐసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ యోగేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఏఐ ఆధారిత ముప్పు గుర్తింపు, జీరో ట్రస్ట్ ఆర్కిటెక్చర్, సప్లై చైన్ భద్రత వంటి అంశాలపై ప్రత్యేక సెషన్లు నిర్వహించారు.

## అలీబాబా 40 దొంగల్లా కల్వకుంట్ల కుటుంబం

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: అలీబాబా 40 దొంగల్లా కల్వకుంట్ల కుటుంబం దోపిడీకి పాల్పడిందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి విమర్శించారు. అందులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఒకరి అని చెప్పారు. ఆ దొంగలకు కేసీఆర్ కుటుంబానికి పెద్ద తేడా లేదని ధ్వజమెత్తారు. కేసీఆర్ కుటుంబం అవినీతికి కేరాఫ్ అడ్రస్ అని ఆరోపించారు. ఈ రాష్ట్రాన్ని అడ్డంగా దోచుకుని నంగనాచి మాటలు మాట్లాడుతున్నారని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ దొంగల్లో ప్రభాకర్ రెడ్డి కూడా ఓ దొంగ అని విమర్శించారు. కల్వకుంట్ల కవిత ఢిల్లీలో లిక్కర్ దుకాణం తెరిచారని ఆరోపించారు. కవిత, కేజ్రీవాల్ కథ ముగిందన్నారు. పెద్దమ్మ గుడి కమాన్ నుంచి మాదాపూర్ దాకా రాత్రి రెండు గంటల వరకు లిక్కర్,



పబ్బు దందాలు కేటీఆర్ బావమరిది సంతోష్‌వేన్నారు. రూ. లక్ష కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.30 వేల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లు ఇచ్చిన డబ్బులను లెక్కలేసుకునేందుకే కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌కు ఎవర్ని రానివ్వడం లేదని ఎద్దేవా చేశారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి 'నీవ్వెంత నీ బతుకెంతా'? తన గురించి మాట్లాడే నైతికత ఉందా? అని ప్రశ్నించారు. ఆయన మాదిరిగా తాను ప్యాకేజీ లీడర్‌ను కాదన్నారు. ఆయన దగ్గరున్నంత ఆస్తి తన దగ్గరుంటే రైతులకు పంచుతానన్నారు. బీఆర్ఎస్ హయాంలో మంత్రులు రాష్ట్ర ఖజానా ఖాళీ చేశారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు అబద్ధమని చెప్పారు. కేంద్రమంత్రిగా ఆయనకు అవకాశం వచ్చిందనీ, రాష్ట్రానికి ఉపయోగపడే పని ఒక్కటైనా చేయాలని ఆయన హితవు పలికారు.

## మతం పేరుతో రిజర్వేషన్లను అడ్డుకోవద్దు

రాజేంద్రనగర్ :అమృత్ తెలంగాణ: మతం పేరుతో రిజర్వేషన్లను అడ్డుకోవద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్ని రాజకీయ పార్టీలకూ విజ్ఞప్తి చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల తీర్మానం చేశామని, అందులో మతపరమైన రిజర్వేషన్‌కు స్థానం లేదని స్పష్టం చేశారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో నూతనంగా బీసీ సెల్‌ను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. యూనివర్సిటీ లో బీసీ సెల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. బీసీలు ఒక్క గొంతుక కావాలని పిలుపు నిచ్చారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీసీ సెల్ ఏర్పాటుకు అనుమతివ్వాలని కోరినా గత పాలకులు అడ్డు కాలు చేశారన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3,4 ప్రకారం బీసీ రిజర్వేషన్ల బిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. వ్యవసాయానికి, వ్యవసాయ విశ్వ విద్యాలయ భద్రతకు తమ ప్రభుత్వం ప్రాముఖ్యత ఇస్తుందని తెలిపారు.

సిడ్నీ విశ్వ విద్యాలయంతో సంప్రదింపులు, ఒప్పంద ప్రక్రియకు ప్రభుత్వపరంగా సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. వీసీ అల్దాస్ జానయ్య నేతృత్వంలో ప్రవేశపెట్టిన నూతన కోర్సులకు, విదేశీ విద్య అభ్యసించేందుకు ఆర్థిక చేయూతని స్తామన్నారు. అలాగే రాష్ట్రంలో అన్ని వ్యవసాయ కళాశాలల వద్ద విద్యార్థులు, సిబ్బందికి రవాణా సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులను ఆయా సమయాల్లో అందుబాటులో తిరిగేలా చర్యలు




తీసుకుంటామని తెలిపారు. బీసీ విభాగ అభివృద్ధికి ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ తన నిధుల నుంచి రూ. 10 లక్షలు మంజూరు చేసినట్టు చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు ఒక బీసీ బిడ్డగా ప్రధాని, కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషన్ చైర్మెన్ టి.నిరంజన్, వీసీ జానయ్య, బీసీ సెల్ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ దామోదరరాజు, బీసీ బోధనేతర సిబ్బంది, నాయకులు భిక్షపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## త్వరలో టీవీవీపీ అప్‌గ్రేడ్

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: త్వరలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ)ను సెకెండరీ హెల్త్ డైరెక్టరేట్‌గా టీవీవీపీ అప్‌గ్రేడ్ చేయనున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ప్రొఫెసర్లకు, అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పించిన నేపథ్యంలో తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి టీవీవీపీలో ఖాళీగా ఉన్న సివిల్ అసిస్టెంట్ సర్జన్ (సీఏఎస్) 1,690 డాక్టర్ పోస్టుల ఖాళీలను భర్తీ చేసేందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. నాన్ టీచింగ్ విభాగంలో డీఎంఈ, డీహెచ్, టీవీవీపీల్లో టైం బాండ్ ప్రమోషన్ల భర్తీలో వయోపరిమితి పెంపుపై కామన్ నిబంధనలు రూపొందించటానికి ఎక్స్‌పర్ట్



కమిటీ నియమిస్తామని తెలిపారు. మంత్రి నిర్ణయాలను డాక్టర్ల సంఘం ప్రతినిధులు స్వాగతించారు. సెకెండరీ హెల్త్‌గా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. డాక్టర్ల పోస్టుల భర్తీకి మెడికల్ బోర్డు త్వరగా విధివిధానాలు రూపొందించాలని మంత్రి ఆదేశించారు. డాక్టర్ల సమస్యలపై ప్రతినిధులు చేసిన విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ నరహరి, సెక్రెటరీ జనరల్ డాక్టర్ లాలు ప్రసాద్, నాయకులు డాక్టర్ రవూఫ్, డాక్టర్ వినయ్ కుమార్, డాక్టర్ గోపాల్, డాక్టర్ క్రాంతి, డాక్టర్ అశోక్, డాక్టర్ రామ్ సింగ్ లు పాల్గొన్నారు.

## తెలంగాణ యూనివర్సిటీ హాస్టల్ డిపాజిట్లను తగ్గించాలి: ఎస్ఎఫ్ఐ


డిచ్ పల్లి :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలోని ఏ యూనివర్సిటీలో లేని విధంగా తెలంగాణ యూనివర్సిటీ లో హాస్టల్ డిపాజిట్ ఫీజులు ఆకాశాన్నంటాయని, అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టల్ విద్యార్థులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్స్ పాటించకుండా ప్రతి హాస్టల్ విద్యార్థి నుండి పదివేల చొప్పున హాస్టల్ డిపాజిట్లను కట్టించుకోవడం అవివేకమని ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తెలంగాణ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో యూనివర్సిటీ లోని న్యూ బాయ్స్ హాస్టల్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్ మాట్లాడుతూ నాన్ స్కాలర్షిప్ , ఓసి విద్యార్థులకు 18 వేల రూపాయల చొప్పున సంవత్సరానికి హాస్టల్ డిపాజిట్లను కట్టించుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీలో పేద మధ్యతరగతి విద్యార్థులే ఈ బోధన చేస్తున్నారని అలాంటి వారి వద్ద ఇలా వసుల్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే యూనివర్సిటీ




ఉన్నతాధికారులు కలగజేసుకొని హాస్టల్ డిపాజిట్లను రూల్ ఆఫ్ రిజర్వేషన్లను పాటిస్తూ తగ్గించాలని డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్తులో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజు, తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్షులు జీషన్, యూనివర్సిటీ ఉపాధ్యక్షులు నాగేంద్ర, నిరంజన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో వారం పాటు వానలు ....భారీ వర్షాల నేపథ్యంలో పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో వారం పాటు వానలు పడే అవకాశముందనీ, పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న తెలిపారు. శనివారం ఎక్కువ ప్రాంతాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వానలు కురుస్తాయి. భారీ వర్షాలు నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడా కురిసే అవకాశముంది. ఆదివారం నాడు కొమ్రంభీమ్ అసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడే సూచనలున్నాయి. సోమవారం నాడు కొమ్రంభీం అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, హైదరాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో, 12న ఆదిలాబాద్, కొమ్రంభీమ్



అసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. 13,14,15 తేదీల్లో పలు చోట్ల భారీ వర్షాలు పడొచ్చు.

# బీఆర్ఎస్ లోకి చేరికలు

## కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్,



మెట్‌పల్లి అమృత్ తెలంగాణ ఆగస్టు 08 మెట్ పల్లి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మెట్ పల్లి పట్టణానికి చెందిన యువకులు స్వచ్ఛందంగా చేరారు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ వారికి బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ కేసీఆర్ గారు చేసిన అభివృద్ధి చూసి మళ్లీ తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ తో కలిసి ఆరు గ్యారెంటీలు మరియు 420 హామీలు అమలు చేసేదాకా ఈ ప్రభుత్వం పై కొట్లాడుతామని కాంగ్రెస్ నుండి బీఆర్ఎస్ పార్టీలో చేరిన యువకులు.

# కొత్త రేషన్ కార్డుల పంపిణీ





మల్లాపూర్ అమృత్ తెలంగాణ ఆగస్టు 08 మండలంలోని మొగిలిపేట గ్రామంలో కొత్తగా రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగిందా, పేర్లు లేని వారు పేర్ల నమోదు చేసుకున్న వారికి వచ్చిన రేషన్ కార్డులు కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయడం ఉత్తంజరిగింది. రానున్న రోజుల్లో ఇంకా రేషన్ కార్డులు వచ్చే నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని కావున ఎవరికైనా రేషన్ కార్డులు లేకపోయినా, పేర్లు మార్పు చేయదలచుకున్న అప్లై చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం, ప్రజలకోసం పని చేస్తుంది అని అన్నారు కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏలేటి. జలపతిరెడ్డి, గోల్కొండ. రమేష్,మాసుల. చిన్నయ్య, వర్ద. సురేష్, దండవేని. రాజేందర్, నైనేని. రాజేందర్,మాసుల. బుచ్చిరెడ్డి, ఎలా. వినోద్ ,గోల్కొండ. ప్రవీణ్ లు పాల్గొన్నారు. అందుతున్న ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న ప్రక్రియలో భాగంగా గ్రామంలో మొదటి సారిగా ఏలేటి. ప్రవళికకు మొదటి విడతగా వారి ఖాతాలో లక్ష రూపాయలు జమ చేయడం జరిగింది . అందుకుగాను లబ్ధి దారులు సంతోషం వ్యక్తంచేశారు.

# ఆపదలో ఉన్న వారికి రక్తం దానం చేసిన ప్రవీణ్ ఫోటో క్రియేషన్స్ షాప్ కు చెందిన నిర్మల్ జిల్లా ఓనర్ అయినటువంటి ప్రవీణ్



బైంసా పట్టణంలోని గవర్నమెంట్ ఏరియా ఆసుపత్రిలో భైంసా గ్రామానికి చెందిన గీత అనే గర్భవతి మహిళలకు రక్తము అవసరం ఉందని ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు రోజా మేడం తెలిపారు. దీంతో ఫోన్ చేసిన వెంటనే స్పందించి బ్లడ్ డోనర్స్ గ్రూపులో పోస్ట్ చేసిన వెంటనే ఫోటోక్రియేషన్స్ షాప్ చెందిన ప్రవీణ్ స్పందించి వెంటనే బ్లడ్ బ్యాంక్ రక్త నిధికి వచ్చి తన అమూల్యమైన బి పాజిటివ్ రక్తం దానం చేసి ఒక నిండు ప్రాణాన్ని కాపాడారు. ఆపదలో ఉన్న వారికి రక్తం ఇచ్చిన దాత ప్రవీణ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటివరకు 3 సార్లు రక్తం ఇవ్వడం జరిగింది. ముఖ్యంగా యువత తమ వంతు సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. ఇ కార్యక్రమంలో డాక్టర్ కాశీనాథు సార్ మరియు అనిల్ సార్ తదితరులు పాల్గొనారు....ఆపదలో మేమున్నాం అంటున్న బ్లడ్ డోనర్స్ గ్రూప్ అండ్ టీం బైంసా సభ్యులు.

# వడూర్ మాజీ MPTC ఉప్పు పోశెట్టి పరామర్శించిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆడే గజేందర్



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : నేరడిగొండ మండలంలోని వడూర్ మాజీ MPTC ఉప్పు పోశెట్టి మరియు అదే గ్రామానికి చెందిన షేక్ నాసిర్ గత కొన్ని రోజులకు నుండి అనారోగ్యంతో బాధపడటంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించి వారి ఆరోగ్య క్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు ఆయన వెంట ఆత్మ డైరెక్టర్ కుంట శంకర్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాయుడు రవి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉషన్న పాలశంకర్ ,మహేందర్, చంద్రశేఖర్, బొలిశెట్టి రాములు, ఇసాక్, రామక్రిష్ణ,గంధం నవీన్ ,వీరన్న, రాములు, కాశన్న, తదితరులు ఉన్నారు

# మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు సన్మానించిన ఇంద్రవెల్లి రాజ్ గోండ్ సేవ సమితి సభ్యులు



మాజీ ఎంపీ సోయం బాబురావు సన్మానిస్తున్న దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్లే, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు ఇంద్రవెల్లి రాజ్ గోండ్ సేవ సమితి సభ్యులు సన్మానించారు. రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసి మొదటి సరిగా ఇంద్రవెల్లి అమరుల స్థూపం వద్ద వెళ్లగా ఇంద్రవెల్లి రాజ్ గోండ్ సేవ సమితి సభ్యులు శాలువాతో సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో షెడ్మకి ఆనంద్ రావు రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజ్ గోండు సేవ సమితి,ఇంద్రవెల్లి రాజ్ గోండ్ సేవ సమితి మండల అధ్యక్షులు కనక తులసీరాం ఉపాధ్యక్షులు కోవ వేణుగోపాల్ , మాజీ సర్పంచ్ మెస్రం నాగ్ నాథ్, మాజీ సర్పంచ్ మాడవి భీం రావు, మెస్రం జైరాం, మెస్రం మారుతీ పటేల్, కనక జుగది రావు, మాడవి శ్యామ్ రావు, రామ్ దాస్, నర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.

# పశువుల్లో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి..



బజార్ హాత్నూర్ :అమృత్ తెలంగాణ: రైతులు తమ పశువులకు సోకే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి పర్వీజ్ అహ్మద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పశువైద్యాశాలలో ఉచిత లంపి స్కిన్ (ముద్ద చర్మ వ్యాధి) నివారణ టీకాల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులైన లంపి స్కిన్ ( ముద్ద చర్మ వ్యాధి) బ్లూటంగ్ (నీలి నాలుక వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు. ముద్దపు చర్మవ్యాధి సోకితే పాడి రైతుకు ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లుతుందని, పాల దిగుబడి గణనీయంగా తగ్గి రైతుకు ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తగులుతుందని అన్నారు. అనంతరం పశువుల్లో, గొర్రెలకు ఈ వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఆనందోత్సవాల మధ్య రక్షాబంధన్..




బజార్ హత్నూర్ :అమృత్ తెలంగాణ: మండల కేంద్రంలోని కురుక్షేత్ర పాఠశాలలో శుక్రవారం రాఖీ పండగ సందర్భంగా ముందస్తు రక్షాబంధన్ వేడుకలను పిల్లలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. పిల్లలు ఒకరినొకరు రాఖి కట్టుకొని నేను నీకు రక్ష నువ్వు నాకు రక్ష మనం ఇద్దరం ఈ దేశానికీ, ధర్మానికీ రక్ష అని శుభాకాంక్షలు తెలుపుతూ అన్నా చెల్లెళ్ల అనుబంధాన్ని చాటుకున్నారు. రాఖీ పండగ విశిష్టతను ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సబ్బిడి నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగంలో అధునాతన పద్ధతులను అవలంబించాలి....

## డ్రోన్ ల ఉపయోగంలో చాలా ప్రాముఖ్యత...

## ఎమ్మెల్యే పాయల్ శంకర్...





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అధునాతన పద్ధతులను అవలంబిస్తూ వ్యవసాయ సాగులో రైతులు ముందుకు సాగాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సూచించారు. నూతన పద్ధతిలో భాగంగా డ్రోన్ ల ఉపయోగానికి చాలా ప్రాముఖ్యత ఉందని అన్నారు. వ్యవసాయ రంగంలో ఉపయోగపడే డ్రోన్ ల వాడకంలో పైలెట్ ట్రైనింగ్ లో భాగంగా 30 మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. వ్యోమిక్ డ్రోన్స్ కంపెనీ ప్రవేశపెట్టిన నూతన డ్రోన్ లను ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించి, వాటి ఉపయోగాన్ని కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధునాతన డ్రోన్ ల ద్వారా వ్యవసాయ రంగంలో రైతులకు ఉపయోగపడమే కాకుండా, డ్రోన్ ల శిక్షణ తీసుకున్న డ్రోన్ పైలెట్లకు సైతం ఉపాధి లభిస్తుందన్నారు. యువత స్వయం ఉపాధి పొందేందుకు బ్యాంకుల నుండి రుణాలు పొందేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఆదిలాబాద్ లోని యువకులందరూ సైతం ఇలాంటి డ్రోన్ పైలెట్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులతో పాటు వ్యోమిక్ డ్రోన్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు

# మానవ జాతికి మూల కారణం ఆదివాసీలే..

## రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయాలి...

## ఎమ్మెల్యే పాయల్ శంకర్



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : మానవ జాతికి మూల కారణం ఆదివాసీలేనని, అయినప్పటికీ వారి అభివృద్ధి నేటికి ఆమడ దూరంలోనే ఉందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీల అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రధానమంత్రి జన్మన్ యోజన పథకం ద్వారా వేల కోట్లు విడుదల చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మ్యాచింగ్ గ్రాండ్స్ ను సరైన సమయంలో విడుదల చేయకపోవడంతో ఆదివాసీల అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవంను పుస్కరించుకొని ఆదిమ గిరిజన కొలం సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను శుక్రవారం ఎమ్మెల్యే సంఘం నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నప్పటికీ సంవత్సర కాలం పాటు ఆదివాసీలు తమ సమస్యల కోసం పోరాడుతూనే ఉన్నారన్నారు. ఆనాడు ఆదివాసి నేతలు చేసిన ఎన్నో పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని నేటికీ పోరాటాలు కొనసాగిస్తున్నారని గుర్తు చేశారు. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు గడిచినప్పటికీ నేటికీ పలు ఆదివాసి గూడాలకు కనీస మౌలిక వసతులైన రోడ్డు, తాగునీరు, విద్య, వైద్యం ఉండడానికి ఇంటి సౌకర్యం లేదంటే అతిశయోక్తి కాదన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్న ఆదివాసీల అభివృద్ధికి చేయుతనందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని విద్యార్థులకు బ్యాంకు ఖాతాలు తెరిచిన అధికారులు.




అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : బాలశక్తి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ బ్యాంకు ఖాతాలు ఉండాలన్న ఉద్దేశంతో, అధికారులు బ్యాంకు ఖాతాలు తెరుస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడ్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ పాఠశాల, జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్

ఆధ్వర్యంలో 350 బ్యాంకు ఖాతాలు తెరిచి, విద్యార్థినులకు అందివ్వడం జరిగింది. ఇదివరకే సారంగాపూర్ మండలంలో ఎస్బిఐ, టిజిబి బ్యాంకుల సహకారంతో 500 ఖాతాలు తెరిపించినట్లు చెప్పారు.

# దీక్షకు మద్దతు తెలిపిన చికెన్ సెంటర్ అసోసియేషన్




జన్నారం :అమృత్ తెలంగాణ: భారీ వాహనాల రాకపోకలకు అనుమతి ఇవ్వాలని జన్నారం చికెన్ సెంటర్ అసోసియేషన్ నాయకులు సులువ జనార్ధన్ డిమాండ్ చేశారు. భారీ వాహనాల కోసం జన్నారంలో దీక్ష చేస్తున్న భూమాచారి, బద్రీ నాయక్ను కలిసి శుక్రవారం మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ.. అటవీ ఆంక్షలతో అభివృద్ధి పూర్తిగా ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జన్నారం మండల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో చికెన్ సెంటర్ అసోసియేషన్ సభ్యులు లింగంపల్లి రాజు, షేక్ ఇమ్రాన్, నాగిశెట్టి రవి, యండి రఫిక్, నగరు మహేందర్, ఎస్ డి ముజాఫర్, శివాని విక్రమ్ ఎంపిటిసి, వాసాల నరేష్ , ఎనగందులసన్ని,యండి ఫెరోజ్ , షేక్ తాజ్ బాబ పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్

**బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన తలమడుగు మండలంలోని దేవాపూర్ మాజీ ఎంపీటీసీ,**
**మాజీ ఉప సర్పంచ్ మరియు మైనార్టీ నాయకులు, గ్రామస్తులు దాదాపు 25 మంది ఆడే గజేందర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు**
**బిఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే బూటకపు ఆరోపణలు చేస్తున్నారు - ఆడే గజేందర్**

**తలమడుగు : ప్రజా సంక్షేమమమే ప్రభుత్వం లక్ష్యమని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు శుక్రవారం ఆదిలాబాద్ పట్టణ కేంద్రంలోని గోక గణేష్ రెడ్డి గారి కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో తలమడుగు మండలంలోని దేవాపూర్ మాజీ ఎంపీటీసీ, మాజీ ఉప సర్పంచ్ మరియు గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీలో చేరారు**






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ఆడే గజేందర్ గారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేస్తూ వస్తుందని, ఇది చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు లేనిపోని కుంటిసాకులు చెప్పడం విడ్డూరంగా ఉందని ఆడే గజేందర్ అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే బూటకపు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ప్రజలకు చెప్పిన హామీల ప్రకారం ఆరు గ్యారెంటీలను క్రమబద్ధంగా అమలు చేస్తూ వస్తున్నామని ఆడే గజేందర్ పేర్కొన్నారు. అంతకు ముందు బీఆర్ఎస్ పార్టీకు చెందిన దేవాపూర్ మాజీ ఎంపీటీసీ, మాజీ ఉప సర్పంచ్ మరియు మైనార్టీ నాయకులు, గ్రామస్తులు మాజీ ఎంపీటీసీ శానం భూమన్న, ఉప సర్పంచ్ నాయిని లక్ష్మణ్, షేక్ సిలార్,షేక్ షబ్బీర్ పటేల్,నాయిని పోతన్న, నాయిని రాజన్న,బక్కన్న,పోతుగంటి నారాయణ, ధరబోయిన నారాయణ,రామన్న,నడిపి భూమన్న, షేక్ అఫీజ్, గోపి, నరేందర్, లింగన్న, శ్రీరాం,షేక్ షాహద్ అలీ, మహేందర్, నర్సింలు,మద్దుల నరేందర్ రెడ్డి, గుమ్ముల నర్సయ్యా, సురేష్ రెడ్డి, చల్లా కరుణాకర్ రెడ్డి, ఎల్లూరు సుధాకర్ రెడ్డి తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలోకి బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ కండువా కప్పి స్వాగతం పలికారు.

కార్యక్రమంలో పార్టీ నాయకులు డిసిసిబి చైర్మన్ అడ్డి భోజ రెడ్డి, బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి,మాజీ జడ్పీటీసీ బాబన్న, మాజీ మాజీ ఎంపీపీ కళ్యాణం రాజేశ్వర్, సుంకుడి మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్, ఇచ్చోడ బ్లాక్ ఆత్మ డైరెక్టర్ బాపురెడ్డి, సీనియరు నాయకులు దేవ రెడ్డి, పోశెట్టి,బాబు ఖాన్,యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతరెడ్డి,యువ నాయకులు సతీష్ నాయక్, యండి సద్దాం, మౌలానా తదితరులు పాల్గొన్నారు

# బార్‌లో తాగిన బిల్లు ఇవ్వకుండా గందరగోళం - కౌంటర్ ఉద్యోగి ముఖంపై గాజుతో దాడి - ఇద్దరు నిందితులపై కేసు

**ప్రధాన నిందితుడు ఏ వన్ అరెస్ట్, రిమాండ్ కు తరలింపు.**
**తాగిన మైకంలో బారు ఉద్యోగిపై దాడి మరియు పలు సామాగ్రి ధ్వంసం.**
**వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్.**




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబేద్కర్‌చౌక్‌లో ఉన్న శివా బార్‌లో జూలై 11న రాత్రి జరిగిన ఘటనలో నిందితులు

A1) జాధవ్ శ్రీనివాస్ S/o జాధవ్ జైవంత్‌రావు, వయసు: 34 సం., ఇచోడ, ఆదిలాబాద్,

A2) రాథోడ్ సాయినాథ్ S/o శేషారావు, వయసు: 27 సం., న్యూ హౌసింగ్ బోర్డ్, ఆదిలాబాద్.


ఇద్దరు వ్యక్తులు బార్‌లో మద్యం సేవించి, బిల్లు రూ. 1,850/– చెల్లించాల్సిన చోట కేవలం రూ. 1,500/– మాత్రమే చెల్లించి మిగిలిన మొత్తం ఇవ్వకుండా అదనపు మద్యం ఇవ్వమని డిమాండ్ చేశారు.


సిబ్బంది మిగిలిన రూ. 350/– చెల్లించమని అడగగా, నిందితులు బార్ కౌంటర్ వద్ద వాగ్వాదానికి దిగారు. ఈ సమయంలో A1 కోపంతో కౌంటర్‌పై ఉన్న గాజు గ్లాస్ తీసుకొని ఉద్యోగి ముఖంపై విసిరి గాయపరిచాడు. గాజు దెబ్బ తగిలి బాధితుడు రక్తస్రావంతో గాయపడ్డాడు. అనంతరం నిందితులు కౌంటర్ వెనుక ఉన్న గాజు వస్తువులు ధ్వంసం చేసి సుమారు రూ. 3,500/– నష్టం కలిగించారు.

ఘటనా స్థలంలో ఉన్న మరో ఇద్దరు వ్యక్తులు ఆపడానికి ప్రయత్నించినా, A1 మరియు A2 దూషణలు, బెదిరింపులు కొనసాగించారు. వెంటనే సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ బి. సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి, నిందితులను అరెస్టు చేశారు. నిందితులపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకున్నారు అందులో భాగంగానే ఈరోజు ప్రధాన నిందితుడు A1 జాదవ్ శ్రీనివాస్ ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు. - బి. సునీల్‌కుమార్, వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ 1 టౌన్ పోలీస్‌స్టేషన్, ఆదిలాబాద్.

# ఇద్దరు విద్యార్థులు రెండు ఆంగ్ల కథల పుస్తకాలు రాశారు






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : జడ్పిహెచ్ఎస్ ఇంద్రవెల్లి పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న. నాగచైతన్య మరియు వందన అనే విద్యార్థులు చెరొక ఆంగ్ల కథల పుస్తకాలను రచించారు. ఇంద్రవెల్లి పాఠశాలలో సాంఘిక శాస్త్ర బోధకురాలు శ్రీమతి అరుణ బట్టువార్ గారు విద్యార్థులకు కథా రచనలలో తగు సూచనలను సలహాలు ఇస్తూ విద్యార్థులలో దాగి ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికితీయడానికి వారిని బాల కవులుగా తీర్చిదిద్దడానికి కథా రచనలోని మెలకువలను తెలియజేస్తూ ఇంద్రవెల్లి పాఠశాల విద్యార్థులచే రెండు పుస్తకాలు రచింప చేయడం జరిగింది. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ సమావేశ మందిరంలో వందన స్టోరీస్, మరియు నాగచైతన్య స్టోరీస్ అనే కథల పుస్తకాలను ఆవిష్కరించడం జరిగింది. విద్యార్థులు రచించిన పుస్తకాలను చూసి జిల్లా కలెక్టర్ గారు ఎంతగానో ప్రశంసించారు. మున్ముందు ఇలాంటి పుస్తకాలు ఇంకా రావాలని బాల కవులుగా తార స్థాయికి ఎదగాలని తెలియజేశారు. విద్యార్థులు రచించిన కథలలో మనం చాలా కోణాలను చవిచూస్తాము, విద్యార్థుల కథలలో బడి అనుభవాలు, మార్కులు గ్రేడింగులు చెడు స్నేహాలు, ఆడపిల్లల చదువులు , నైతిక విలువలు చదువు విలువలు. ఆరోగ్య సూత్రాలు మరెన్నో దృక్పదాలలో మనకు కథలు కనిపిస్తాయని గైడ్ టీచర్ అరుణ బట్టువార్ మేడం గారు తెలియజేశారు. ఈ పుస్తకాలు ఈ తరం విద్యార్థులకు ఎంతగానో ఉపయుక్తంగా ఉన్నాయని ప్రతి పాఠశాల విద్యార్థులు. ఈ కథల పుస్తకాలను చదివి తీరాల్సిందేనని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్ గారు, అజయ్ రవీంద్రా చారి , జలంధర్ రెడ్డి, రవీందర్ రెడ్డి. సంతోష్ బట్టువార్, విద్యాసాగర్, జ్యోత్స్నా మేడం గార్లు. వివిధ పాఠశాల విద్యార్థులకు ఈ పుస్తకాలను చదవమని తెలియజేశారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా సమావేశానికి హాజరైన వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రతిభను కథా రచనలో వారి కృషిని పొగడుతూ చిన్నారులను దీవిస్తూ ప్రశంసల వర్షం కురిపించారు.

# జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ 1 సంవత్సరం నుండి 19 సంవత్సరాల వయసు గల పిల్లలందరికి ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలి ఆగస్ట్ 11 నుండి 18 వరకు ఈ నెల 11 న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా క్యాంప్ కార్యాలయం లో వైద్య ఆరోగ్య, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు నులిపురుగుల నిర్మూలన కోసం 1 నుండి 19 సంవత్సరం లోపు వారందరికీ ఈ నెల 11 న ఆల్బెండోజల్ మాత్రలు తప్పకుండా వేయించాలని జిల్లా కలెక్టర్ అన్నారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ

1 నుండి 19 ఏళ్ల వయసున్న ప్రతి ఒక్కరికీ నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలను వైద్య ఆరోగ్యశాఖ తో పాటు సంబంధిత ప్రభుత్వ విభాగాలు , ప్రైవేట్ పాఠశాలలు ,కళాశాలల యాజమాన్యాలు తప్పకుండా శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. పిల్లలలో నులిపురుగులు ఉండటం వలన వారిలో పోషకాహార లోపం ,రక్తహీనత ,ఆకలి మందగించడం తదితర ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని, వీటివల్ల చదువుపై ఏకాగ్రత కోల్పోతారని అన్నారు.

అన్ని పాఠశాలలు, హాస్టల్స్, అంగన్వాడీ కేంద్రాలలో ఈ మాత్రలు అందుబాటులో ఉన్నాయని పిల్లలందరికి కేంద్రాల లోనే మాత్రలు తప్పకుండా ఇప్పించాలన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రం ,పాఠశాల, కళాశాల కు ఒక అంగన్వాడీ కార్యకర్త ,ఆశా కార్యకర్త,ఏఎన్ఎం లను అనుసంధానం చేయాలని , రెసిడెన్షియల్ పాఠశాలలు కళాశాలలో ఉన్న ఏఎన్ఎంలు లేదా నర్సింగ్ ఆఫీసర్లు సంబంధిత ఇన్స్టిట్యూషన్ లో అందరికీ అందించాలన్నారు. జిల్లాలో ఒకటి నుండి 19 సంవత్సరాల లోపు 2,06,127 మంది పిల్లలు ఉన్నారన్నారు. రెసిడెన్షియల్ విద్యా సంస్థల రీజనల్ కో ఆర్డినేటర్లను కార్యక్రమంలో భాగస్వాములుగా చేయాలన్నారు. ఈ సందర్భంగా జాతీయ నులి పురుగుల దినోత్సవ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సమావేశం లో జిల్లా వైద్య శాఖాధికారి నరేందర్ రాథోడ్, మాట్లాడుతూ మాత్రల వలన ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావని, ఎలాంటి అపోహలు ఉండకూడదన్నారు.

మధ్యాహ్నం భోజనం అనంతరం మాత్రలు విద్యార్థులకు చేయాలనీ,

ఒక సంవత్సరం నుండి రెండు సంవత్సరాల వారికి సగం మాత్ర , రెండు సంవత్సరాలు ఆ పై 19 సంవత్సరాల వయసు గల వారికి ఒక పూర్తి మాత్ర నమిలి మింగించాలన్నారు. ప్రోగ్రాం అధికారులు, ఆర్బీఎస్కే బృందాలు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తాయని, ఏదైనా కారణంతో 11 వ తేదీన మాత్రలు వేసుకోలేని వారికోసం 18వ తేదీన మాపప్ రౌండ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డి ఎం హెచ్ ఓ సంబధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య పాఠశాల రెండవ విడత సమీక్ష సమావేశం

**స్టూడెంట్ చాంపియన్ లకు సర్టిఫికెట్లు అందించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా.**





**ఆరోగ్య పాఠశాల రెండవ విడత కార్యక్రమం లో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య పాఠశాల సమీక్ష లో వివిధ అంశాల పై జిల్లాలోని 18 మండలాల పాఠశాల విద్యార్థుల ప్రదర్శన తీరును పరిశీలించి స్టూడెంట్ చాంపియన్ లకు సర్టిఫికెట్ అందజేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా.**

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ : ఆరోగ్య పాఠశాల రెండవ విడత కార్యక్రమం లో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని 18 మండలాలకు చెందిన పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ఆరోగ్యంపై నిర్వహించిన వివిధ ప్రదర్శనలను జిల్లా కలెక్టర్ శ్రీ రాజర్షి షా స్వయంగా పరిశీలించారు. విద్యార్థుల ప్రదర్శనలు సృజనాత్మకత, అవగాహన , ఆరోగ్యంపై పెంపొందించిన చైతన్యం దృష్టిలో ఉంచుకొని కలెక్టర్ "స్టూడెంట్ చాంపియన్" లుగా ఎంపికైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు (సర్టిఫికేట్లు) అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆరోగ్యంపై చైతన్యం పెంపొందించడమే కాకుండా, సమాజంలో ఆరోగ్య సంస్కృతిని కలిగించేందుకు విద్యార్థులు మార్గదర్శకంగా మారతారని కలెక్టర్ ఆకాంక్ష వ్యక్తం చేశారు. అన్ని మండలాల , పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయకర్తలు ఈ కార్యక్రమ విజయవంతానికి కృషి చేసినందుకు కలెక్టర్ అభినందనలు తెలిపారు

ఆరోగ్య పాఠశాల ఆరు సూత్రాలవిధిగా విద్యార్థుల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా schools ఈ 6 సూత్రాలను అమలు చేయాలి:

1. ఆహార భద్రత , పోషకాహారం

విద్యార్థులకు శుభ్రమైన, పోషకాహారంతో కూడిన ఆహారం అందించటం. హెల్తీ టిఫిన్, Junk food నివారణపై అవగాహన కల్పించటం.

2. హైజీన్ ,పరిశుభ్రత

వ్యక్తిగత , పాఠశాల పరిశుభ్రత పాటించడం. చేతులు కడుక్కోవడం, శుభ్రమైన వాతావరణం కల్పించడం మొదలైనవి.

3. ఫిజికల్ ఆక్టివిటీ – ఆరోగ్యకరమైన జీవనశైలి

విద్యార్థులలో రోజువారీ వ్యాయామం, క్రీడలు, యోగా వంటి శారీరక చురుకుదనాన్ని ప్రోత్సహించడం.

4. నలుగురితో మంచి సంబంధాలు – మానసిక ఆరోగ్యం

విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని కాపాడడం, వారిలో నమ్మకం, నైతిక విలువలు, మానసిక మద్దతును పెంపొందించడం.

5. ఆరోగ్య సేవలు , తక్షణ వైద్యసేవలు

అవసరమైన ఆరోగ్య తనిఖీలు (health check-ups), ఫస్ట్ ఎయిడ్ సదుపాయాలు పాఠశాలల్లో ఏర్పాటు చేయడం.

6. పర్యావరణ పరిరక్షణ ఆరోగ్య విద్య

పర్యావరణ శుభ్రత పై అవగాహన కల్పించడం, వృక్షారోపణ, ప్లాస్టిక్ వినియోగం నివారణ వంటి అంశాలపై విద్యార్థులలో చైతన్యం తీసుకురావడం.

ఈ 6 సూత్రాలు ఆరోగ్య పాఠశాల కార్యక్రమానికి పిల్లలలో ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి: జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్.



అమృత తెలంగాణ నిర్మల్ న్యూస్ జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 11 వ తేదీన జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆ రోజు నుండి 18 వ తేదీ వరకు నులిపురుగుల నిర్మూలన కొరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీలు మొదలుకొని, ప్రభుత్వ పాఠశాలను కళాశాలలో 1 నుంచి 19 సంవత్సరాల వయసు గల పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు (ఆల్బెండజోల్) మాత్రలు అందించాలని అన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జిల్లాలో 1,91,998 మందికి ఈ మాత్రలను అందించబోతున్న అంటూ తెలిపారు. ఏదైనా కారణాల వల్ల 11వ తేదీన ఆల్బెండజోళ్ళ మాత్రలు తీసుకొని వారికి 18వ తేదీన మాప్ అప్ డే సందర్భంగా మాత్రలు అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజేందర్, కార్యక్రమ నిర్వహణ అధికారి నైయానా రెడ్డి, వైద్యశాఖ అధికారులు సౌమ్య, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆశా కార్యకర్తపై ఏఎన్ఎం దురుసు ప్రవర్తన .!

చందుర్తి :అమృత్ తెలంగాణ: ఓ ఆశ కార్యకర్తపై ఏఎన్ఎం దురుసుగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మానాల గ్రామానికి చెందిన ఓ ఆశ కార్యకర్త రికార్డులు సరిగా రాయలేదనే నెపంతో అమానుష పదజాలంతో, అక్షరాలలో రాయలేని విదంగా మాటలు అనడంతో మంగళవారం చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన రివ్యూ మీటింగ్ లో ఆశ కార్యకర్త ఆవేదనతో వైద్యాధికారి సురేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. గతంలో కూడా కొందరు ఏఎన్ఎంలు, ఓ సూపర్ వైజర్ దర్భశాలడినట్లుగా కూడా ఆరోపణలున్నాయి.

చర్యలు శూన్యం..తన కు జరిగిన అవమానాన్ని వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లినా.. కనీసం మందలించకుండా వదిలేయడంతో వైద్యాధికారి నిర్లక్ష్యం వల్లే తమకు అవమానాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు విచారణ చేపట్టి ఏఎన్ఎం పై చర్యలు తీసుకోవాలని పలువురు వాపోతున్నారు. దీని పై వైద్యాధికారి సురేష్ కుమార్ ను ఫోన్లో వివరణ కోరగా.. అంత బాగానే ఉంది, ఎలాంటి విషయం తమ దృష్టికి రాలేదని తెలిపారు.

# పేదల ఇండ్లు కూల్చితే ఖబర్దార్: సీపీఐ(ఎం)





కరీంనగర్ :అమృత్ తెలంగాణ: కరీంనగర్ లోని సప్తగిరి కాలనీ పక్కనే ఉన్న హస్తినాపురం కాలనీ పేదలకు ఇచ్చిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని లేదంటే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉధృత పోరాటాలు చేస్తామని సీపీఐ(ఎం) నగర కార్యదర్శి గుడికందుల సత్యం హెచ్చరించారు. ఈరోజు సీపీఐ(ఎం) నగర కమిటీ ఆధ్వర్యంలో హస్తినపురం బతుకమ్మ కాలనీ పేదల ఇండ్లను సందర్శించి, వారి సమస్యలను తెలుసుకున్నారు.

గత 25 సంవత్సరాల నుండి ఎస్సారెస్పీ డ్యామ్ లో భూములు కోల్పోయిన వారికి ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇచ్చిందని, మున్సిపల్ అనుమతులతో అన్ని రకాల పనులు చెల్లిస్తూ పేదలు జీవిస్తున్నారని. అటువంటివారిని ఇండ్లు కాలి చేయాలని, లేదంటే కూల్చివేస్తామని డ్యామ్ సేఫ్టీ అధికారులు నోటీసులు ఇచ్చారని బాధితులు సీపీఐ(ఎం) బృందానికి విన్నవించుకున్నారు.

ఈ సందర్భంగా నగర కార్యదర్శి గుడికందుల సత్యం మాట్లాడుతూ.. 25 సంవత్సరాల నుండి అన్ని అనుమతులతో నిర్మించుకున్న పేదల ఇండ్లను ఎట్లా కూల్చుతారని ప్రశ్నించారు. పేదల ఇంటి ఒక్క ఇటుక కూల్చిన సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బుల్డోజర్లకు అడ్డుపడి పేదల ఇండ్లను రక్షిస్తామని అన్నారు. గత పాలకులు అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని ఒక్క ఇల్లు ఇవ్వకపోగా, ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం, ప్రజల పాలన అంటూ పేదలను మోసం చేస్తున్నారని, పేదలకు ఇండ్లు ఇవ్వకపోగా ఉన్న ఇండ్లనే కూల్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బి ఆర్ ఎస్ కాంగ్రెస్ పైన, కాంగ్రెస్ ప్రభుత్వం గత బిఆర్ఎస్ ప్రభుత్వం పైన ఆరోపణలు చేసుకుంటూ పేదలను వంచిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ స్థలాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూ బకాసురులు దర్జాగా కబ్జాలు చేస్తూ అపార్ట్మెంట్లు కడుతుంటే చూస్తూ ఊరుకుంటున్న అధికారులు, పేదల ఇండ్లను మాత్రం కూల్చడానికి ఉత్సాహం చూపుతున్నారని మండిపడ్డారు. హస్తినపురంలోని పేదల ఒక్క ఇల్లును కూల్చిన సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అడ్డుకొని పోరాటాన్ని ఉధృతం చేస్తామని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన నోటీసులను వెంటనే వాపస్ తీసుకోవాలని, లేదంటే పేదల పక్షాన దశలవారీగా పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.బీమసాహెబ్, నగర కమిటీ సభ్యులు, గాజుల కనకరాజు, వినయ్, నాయకులు సందేశ్, శివరాజ్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో బీఆర్ఎస్ చేనేత దినోత్సవ వేడుకలు



రాజన్న సిరిసిల్ల :అమృత్ తెలంగాణ: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బి.ఆర్.యస్ సిరిసిల్ల పట్టణ శాఖ ఆద్వర్యంలో జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య , పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి ల ఆధ్వర్యంలో సిరిసిల్ల నేతన్న విగ్రహానికి పూలమాలలు వేసి అలంకరించారు. అనంతరంకొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేశారు.కార్యక్రమంలో గూడూరి ప్రవీణ్, ఆకునూరి శంకరయ్య, కార్మిక విభాగం అధ్యక్షులు వెంగళ శ్రీనివాస్ , మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్ , అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ అడగట్ల మురళి , మహిళా విభాగం

అధ్యక్షురాలు బత్తుల వనజ, పార్టీ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, సబ్బని హరీష్, మాజీ కౌన్సిలరు అన్నారం శ్రీనివాస్ ,దార్నం అరుణ ,కల్లూరి రాజు, గెంట్యాల శ్రీనివాస్, దార్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో మొదలైన రాఖి పండగ సందడి



గోవిందరావుపేట : అమృత్ తెలంగాణ: రాఖీలు, స్వీట్లు కొనుగోలులో బిజీగా ఆడపడుచులు రాఖీ పండగ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలలో పండగ వాతావరణం దండిగా నెలకొంది. గత రెండు మూడు రోజులుగా రాఖీలు కొనడంలో మామూలుగా కనిపించిన మహిళలు శుక్రవారం నాడు పసర గోవిందరావుపేట చలువాయి ప్రధాన గ్రామాలతో పాటు దుంపల్లిగూడెం కర్లపల్లి లక్ష్మీపురం బుసాపురం గ్రామాలలో సాధారణ కిరాణా షాపుల వద్ద కూడా రాఖీలు ఖరీదు చేస్తూ సందడి చేశారు. దూరప్రాంతాలకు వెళ్లేవారు ఇప్పటికే బస్టాండ్ కు చేరుకొని ప్రయాణాలు మొదలుపెట్టారు. రాఖీలతోపాటు అవసరమైన స్వీట్లను కూడా ఖరీదు చేశారు. ఉదయాన్నే షాపులు తెరుచుకోవని మహిళలు రాఖీలతో పాటు స్వీట్లు కూడా కొన్ని ఇళ్లకు తీసుకొని వెళుతున్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రాఖీ పండగ ప్రాధాన్యత ప్రాచుర్యము అంతకంతకు పెరుగుతుందని సోదర భావం మరింత బలపడుతుంది అనటానికి ఈ పండగకు పెరుగుతున్న ప్రాధాన్యతే కారణమని అన్నారు. ఇంటి లోని ప్రతి చిన్నపిల్ల మొదలుకొని వృద్ధురాలు వరకు సోదర సమానులైన వారందరికీ రాఖీలు కడుతూ బంధాన్ని బలోపేతం చేస్తున్నారని అన్నారు.

# శంకరపట్నంలో పండుగ సాయన్న జయంతి వేడుకలు



శంకరపట్నం:అమృత్ తెలంగాణ: శంకరపట్నం మండలంలో తెలంగాణ రాబిన్ హుడ్, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అయిన పండుగ సాయన్న జయంతి వేడుకలను శుక్రవారం ముదిరాజ్ మహాసభ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కీసర సంపత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి భూమ సంపత్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గూళ్ల రాజు, మండల బీసీ సెల్ అధ్యక్షులు రెడ్డి పవన్, నూనె శ్రీకాంత్, మరియు మండల పరిధిలోని వివిధ సంఘాల అధ్యక్షులు గరిగె ప్రభాకర్, రవితో పాటు భారీ సంఖ్యలో ముదిరాజ్ యువకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బొద్దింకలతో నిండిన గదిలో జాన్వీ బంధిఖానా



బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో క్షణం తీరిక లేకుండా ఉంది జాన్వీ కపూర్. ఈ యంగ్ బ్యూటీ నటించిన మిలీ ఎట్టకేలకు నవంబర్ 4న పెద్ద తెరపైకి వచ్చింది. పాజిటివ్ సమీక్షలతో మిలీ బాక్సాఫీస్ వద్ద బాగానే రాణించిందని ట్రేడ్ వెల్లడించింది. మత్తుకుట్టి జేవియర్ దర్శకత్వం వహించిన ఈ సర్వైవల్-థ్రిల్లర్ లో సన్నీ కౌశల్ - మనోజ్ పహ్వా కూడా ప్రధాన పాత్రలు పోషించారు. ఇది మలయాళ భాషా చిత్రం హెలెన్ కి రీమేక్. ఈ సినిమాని జాన్వీ తండ్రి బోనీకపూర్ స్వయంగా నిర్మించడం ఆసక్తికరం. పాపా బోనీ నిర్మాతగా మొదటి సహకారం జాన్వీకి చాలా ప్రత్యేకమైనది. తన స్పెషల్ సర్వైవల్ డ్రామాను ప్రచారం చేస్తూ తాజాగా జాన్వీ చెప్పిన ఓ సంగతి యువతరంలో హాట్ టాపిగ్గా మారింది. తాను బొద్దింకలతో నిండిన గదిలో ఎందుకు బంధించబడాలనుకుంటోందో జాన్వీ ఈ ఇంటర్వ్యూలో వివరించింది. ఒకవేళ బొద్దింకలతో నిండిన గదిలో బంధించబడితే లేదా మిలీ సినిమాలో లాగా ఫ్రీజర్ లో బంధించబడితే..? ఈ రెండిటిలో ఏది బెస్ట్.. మీరైతే ఏం చేస్తారు? మీ ఫీలింగ్ ఏంటీ? అంటూ హోస్ట్ జాన్వీ కపూర్ ని సరదాగా ప్రశ్నించారు. దానికి జాన్వీ ఆసక్తికర సమాధానం ఇచ్చింది. నేను ఫ్రీజర్ లోకి తిరిగి వెళ్లలేను. నేను బొద్దింకలతో నిండిన గదిలో బంధించబడితేనే బెటర్ అని చెప్పింది. ఫ్రీజర్లో ఉండటం చాలా కష్టంగా ఉందని కూడా జాన్వీ తెలిపింది. జాన్వీ కపూర్ మిలీ కథాంశం ఆసక్తికరం. ఒక ప్రముఖ ఫాస్ట్ ఫుడ్ ఫ్రాంచైజీలో వెయిటర్ గా పనిచేసి 48 గంటలకు పైగా ఫ్రీజర్ లో బంధించబడిన ఒక అమ్మాయి కథేమిటన్నది తెరపై చూపించారు.

# మరోసారి బోల్డ్ గా ఒంపుల్ని ప్రదర్శించిన ఇషా



టాప్ మోడల్ కం నటి ఇషా గుప్తా పరిచయం అవసరం లేదు. గ్లామర్ షో విషయంలో హద్దులు చెరిపేసి చెలరేగడం ఈ సీనియర్ బ్యూటీ ప్రత్యేకత. ఇన్ స్టా వేదికగా ఇషాగుప్తా ఎప్పటికప్పుడు చెలరేగి అందాలు ఆరబోస్తుంది. తాజాగా ఇషా షేర్ చేసిన బోల్డ్ ఫోటోషూట్ అంతర్జాలంలో దుమారం రేపుతోంది. ఇషాజీ మరోసారి తనదైన శైలిలో చెలరేగారు. ఈషా గుప్తా జెన్నీ ప్యాక్ మన్ ప్లాటినం గ్రే సీక్విన్డ్ గౌలో వజ్రంలా మెరుస్తోంది. ఫ్లోర్-లాంగ్ గౌనులో త్రీక్వార్టర్ లెంగ్త్ డ్రాప్డ్ స్లీవ్ లో గ్లామర్ ని ఆవిష్కరించిన తీరు కుర్రకారుకు మైండ్ బ్లాక్ చేస్తోంది. మోడల్ కం నటి పర్యావరణవేత్త అయిన ఈషా గుప్తా నటిగా ఇప్పటికే బాలీవుడ్ లో తనదైన ముద్ర వేసింది. తిరుగులేని ఎనర్జీతో స్టైల్ ఐకాన్ గా వెలుగులు విరజిమ్ముతోంది. తన స్టైల్ పై రెగ్యులర్ అప్ డేట్ లతో ఈషా ఇప్పటికే 13 మిలియన్లకు పైగా ఇన్ స్టాగ్రామ్ ఫాలోవర్ల ఫాలోవర్ లను సంపాదించింది. ఈషా గుప్తా నిరంతర ఫ్యాషన్ సెన్స్ పై నేటితరంలో డిబేట్లు సాగుతుంటాయంటే అర్థం చేసుకోవాలి. తాను ఎంచుకున్నది ఎత్నిక్ వేర్ అయినా... ఆరు గజాల పవిట కొంగుతో చీరలో అయినా.. అందమైన గౌనులో అయినా తన డ్రెస్సింగ్ సెన్స్ నుంచి కళ్లు తిప్పుకోవడం అంత ఈజీ కాదు. ఈషా గుప్తా జెన్నీ ప్యాక్ మన్ ప్లాటినం గ్రే సీక్విన్డ్ గౌలో ఒంపులు రంగరించిన తీరుపై చర్చా సాగుతోంది. ఇషాజీ ఫ్యాషన్ ప్రపంచపు మహారాణి. రక రకాల ఫ్యాషన్ దుస్తులకు స్టైలింగ్ చేస్తూ మోడల్ గా అదరగొడుతుంటుంది. తన ఇన్ స్టాగ్రామ్ ఫోటోలలో ప్రయోగాలతో పాటు కాలానుగుణ వస్త్రధారణలతో తన ఆసక్తిని తరచుగా ప్రదర్శిస్తుంది. తళతళా మెరిసే దుస్తులతో ప్రతిసారీ డ్రీమ్ గాళ్ ని తలపిస్తుంది. మెరిసే గౌనులో ఈషా మరోసారి కళ్ళు తిప్పుకోనివ్వని ట్రీటిచ్చింది. ఈసారి జెన్నీ ప్యాక్ మన్ రాక్ ల నుండి ప్లాటినం గ్రే గౌనును ఎంచుకుంది. ఆమె ఫ్లోర్-లాంగ్ గౌనులో త్రీక్వార్టర్ లెంగ్త్ డ్రెప్డ్ స్లీవ్ తో ఆకట్టుకుంది. స్ట్రెయిట్ హెయిర్ నిగనిగల అందాలతో మెరిపించింది ఇషా. ఇషా గుప్తా టాలీవుడ్ కి సుపరిచితం. కానీ ఇక్కడ నటించేందుకు ఎక్కువ ప్రాధాన్యతనివ్వలేదు. రామ్ చరణ్ వినయ విధేయ రామాలో హాట్ ఐటమ్ నంబర్ తో కట్టి పడేసినా ఆ తర్వాత కనిపించలేదు. 'జన్నత్' సినిమాతో బాలీవుడ్ లో లాంచ్ అయింది. ఆ తర్వాత అక్కడ బాగానే అవకాశాలు వస్తున్నాయి. కాలేజ్ డేస్ నుంచి సినిమాలంటే ఆసక్తి. దీంతో ఈషా మోడలింగ్ రంగంలోకి అడుగు పెట్టింది. ఆ తర్వాత ఎన్నో అందాల పోటీల్లో పాల్గొంది. ఫెమినా మిస్ ఇండియా పోటీల్లోనూ నెగ్గింది. చివరిగా బాలీవుడ్ లో నటిగా స్థిరపడింది. ప్రస్తుతం ప్రపంచ సుందరి పోటీలకు ఎంపికయ్యే మోడల్స్ కి ఇషా జీ శిక్షణను అందిస్తున్నారు. ఫెమీనా మిస్ ఇండియా జడ్జిగానూ ఇషా కు చాలా అనుభవం ఉంది. ఇటీవల బాబీ డియోల్ తో కలిసి 'ఆశ్రమ్ సీజన్ 2'లో ఈషా చివరిగా కనిపించింది. పలు భారీ చిత్రాలకు ఇషా గుప్తా సంతకాలు చేసింది. వాటి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

# మల్లె చెండు ఒళ్లంతా చుట్టుకుని కలకలం రేపిన నటి

అందుకే రాగిణి ద్వివేది ఉగాది స్పెషల్ ఫోటోషూట్ తో అభిమానుల ముందుకు వచ్చింది. కొత్తొక వింత పాతొక రోత! పాత సంవత్సరానికి భాయ్ చెప్పి కొత్త సంవత్సరానికి వెల్ కం చెప్పింది కన్నడ నటి రాగిణి ద్వివేది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఇదిగో ఇలా కొత్తగా కొంగొత్తగా తనని తాను పరిచయం చేసుకుంది. గతాన్ని తలుచుకుని సమయాన్ని వృధా చేసేందుకు రాగిణి సిద్ధంగా లేదు. భవిష్యత్ గురించి మాత్రమే ఆలోచిస్తోంది. అందుకే రాగిణి ద్వివేది ఉగాది స్పెషల్ ఫోటోషూట్ తో అభిమానుల ముందుకు వచ్చింది. ఇదిగో ఇలా మల్లె చెండును ఒంటికి చుట్టుకుని, జెరీ అంచు బంగారు వర్ణం సిల్కు చీరలో దేవతా సుందరిలా మెరిసిపోతోంది. అలా పానుపుపై జేరబడి, మల్లెలను ముంజేతికి కట్టుకుని సువాసన పీలుస్తూ, అసలు రాగిణి ఇచ్చిన ఫోజ్‌లు కుర్రకారులో కలకలం రేపుతున్నాయి. పానుపుపై బంతిపూల దండల మధ్య రాగిణి రసరమ్యంగా మెరిసిపోతోంది. ఒక కొత్త సంవత్సరం, ఒక కొత్త అధ్యాయం - దానిని ఆశ - దృఢ సంకల్పంతో స్వీకరించండి! ప్రతి సూర్యోదయం ఒక కొత్త అవకాశాన్ని తెస్తుంది - దీనిని అద్భుత ప్రారంభంగా చేసుకోండి!




# మళయాళ భామ 'కుమారి'గా వస్తుంది..!



మళయాళంలో తన నటతో మెప్పిస్తూ వస్తున్న ఐశ్వర్య లక్ష్మి ఈమధ్య తమిళ సినిమాల్లో కూడా సందడి చేస్తుంది. తెలుగులో గాడ్సే సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది ఐశ్వర్య లక్ష్మి. రీసెంట్ గా పొన్నియిన్ సెల్వన్ 1 సినిమాతో కూడా అమ్మడు ఆకట్టుకుంది. సినిమాలో తన పోర్షన్ వరకు అదరగొట్టేసింది ఐశ్వర్య. సినిమాలే కాదు ఓటీటీ వెబ్ సీరీస్ లతో కూడా ఆడియన్స్ ని అలరిస్తుంది అమ్మడు. ఇటీవలే అమ్ము అంటూ ఓ తెలుగు వెబ్ సీరీస్ తో వచ్చిన ఐశ్వర్య లక్ష్మి ఆ సినిమాతో ప్రశంసలు అందుకుంది. ఆ మూవీ తర్వాత కొద్దిపాటి గ్యాప్ తోనే మరో మూవీతో వస్తుంది ఐశ్వర్య. ఈసారి కుమారి అంటూ ఒక మైథలాజికల్ ఫాంటసీ మూవీతో వస్తుంది. ఈ మూవీని నిర్మల్ సహదేవ్ డైరెక్ట్ చేశారు. నెట్ ఫ్లిక్స్ లో ఈ సినిమా నవంబర్ 18 శుక్రవారం రిలీజ్ అవుతుంది. అమ్ము సినిమాతో ఒక ఇంప్యాక్ట్ క్రియేట్ చేసిన ఐశ్వర్య లక్ష్మి కుమారితో కూడా అలరిస్తుందని అంటున్నారు. ఇప్పటికే నెట్ ఫ్లిక్స్ లో వస్తున్న కుమారి మూవీ టీజర్ ట్రైలర్ ఈ సీరీస్ పై ఆసక్తి కలిగించాయి. థియేటర్ లోనే వస్తేనే కాదు తమకు నచ్చిన కంటెంట్ ఎక్కడ రిలీజైనా సరే చూసేస్తున్నారు ప్రేక్షకులు. ముఖ్యంగా సినిమా టికెట్ల రేట్లు పెరగడం.. అంత ఖర్చు పెట్టి సినిమా చూసినా నిరాశపరచడం లాంటి కారణాల వల్ల థియేటర్ లో సినిమాలు చూసేందుకు ఆసక్తి చూపట్లేదు. అందుకే ఓటీటీలకు ఎక్కువ డిమాండ్ పెరిగింది. భాషతో సంబంధం లేకుండా ఓటీటీ లో వెరైటీ కంటెంట్ ఉంటే చాలు ప్రేక్షకులు విరగబడి చూసేస్తున్నారు. వెండితెర మీద అద్భుతాలు చేయాలని అనుకున్న ఔత్సాహిక కళాకారులకు కూడా ఈ ఓటీటీల్లో మంచి అవకాశాలు వస్తున్నాయి. అందుకే ఈమధ్య ఓటీటీల్లో మంచి మంచి కంటెంట్ సినిమాలు వస్తున్నాయి. తెలుగులోనే కాదు ఇతర భాషల సినిమాలు వెబ్ సీరీస్ లు కూడా మన ప్రేక్షకులు చూస్తున్నారు.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com